క్లుప్తంగా

ఎమ్మెల్సీ తోటను కలిసిన గన్నవరపు



ఎమ్మెల్సీ తోటకు పుష్పగుచ్ఛాన్ని అందిస్తున్న శ్రీనివాసరావు

మండపేట: వైఎస్సార్ సీపీ పి.గన్నవరం నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన గన్నవరపు శ్రీనివాసరావు శుక్రవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక విజయలక్ష్మి నగర్లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శ్రీనివాసరావు తన అనుచరులతో తోట త్రిమూర్తులును కలిసి, శాలువాతో సత్కరించారు. ఆయనకు కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు అప్పగించడంపై ఎమ్మెల్సీ తోట హర్షం వ్యక్తం చేశారు. స్థానిక నాయకులను సమన్వయం చేసుకుంటూ, కార్యకర్తలకు అండగా నిలబడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తోరం భాస్కరరావు, కొనుకు నాగరాజు, తోరం గౌతమ్, రావూరి బుజ్జి, నక్కా వెంకటేశ్వరరావు, జక్కంపూడి వాసు, సాధనాల రమేష్ పాల్గొన్నారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు సత్కారం



వెంకటాయపాలెంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్ శివ గణేష్‌ను సత్కరిస్తున్న బీసీ నాయకులు

రామచంద్రపురం రూరల్: డ్రైవర్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం మండలంలోని వెంకటాయపాలెంలో ఆర్టీసీ బస్సును నిలిపి డ్రైవర్ కాండ్రేగుల శివగణేష్‌ను ఘనంగా సత్కరించారు. గ్రామానికి చెందిన బీసీ నాయకుడు రాయుడు చంద్రరావు ఆధ్వర్యంలో బీసీ నాయకులు కడలి రాంపండు, నందికోళ్ల మూర్తి, డాక్టర్ శ్రావణి తదితరులు డ్రైవర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. డ్రైవర్లు అందిస్తున్న సేవలను కొనియాడారు.

సాధనతో ఉజ్వల భవిష్యత్తు

రాయవరం: విద్యార్థులంతా ఉజ్వల భవితకు స్వామి వివేకానంద స్ఫూర్తితో నిరంతర సాధన చేయాలని రాయవరం మండలం లొల్ల మానవతా ఆశ్రమ వ్యవస్థాపక అధ్యక్షుడు అల్లూరి శ్రీనివాసచౌదరి ఉద్బోధించారు. రాయవరం వీఎస్ఎం వెలమ సామాజిక భవనంలో శుక్రవారం డాక్టర్ జీఎస్ఎన్ రెడ్డి అధ్యక్షతన జరిగిన వ్యక్తిత్వ వికాస అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థులు విజయం వైపు వెళ్లాలంటే ఏకాగ్రత పెంచుకోవాలని, జ్ఞాపకశక్తి ధారణకై మనోనిగ్రహం అలవర్చుకునేందుకు ధ్యానం, యోగా సాధన చేయాలని సూచించారు.

నిబంధనలకు నీళ్లు.. కష్టాలు ఫుల్

- రహదారులపై యథేచ్ఛగా గడ్డి ట్రాక్టర్ల ప్రయాణం
- మితిమీరిన లోడుతో ప్రమాదాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు



గొల్లపాలెంలో గడ్డిలోడు లారీని తప్పించేందుకు అవస్థలు పడుతున్న రైతు

కాజులూరు: రహదారులపై నిబంధనలకు విరుద్ధంగా ఎండుగడ్డి లోడుతో లారీలు, ట్రాక్టర్లు యథేచ్ఛగా తిరగడంతో పలు సమస్యలు తలెత్తుతున్నాయి. లోడు లారీలు, ట్రాక్టర్లు ప్రయాణికుల పాలిట మృత్యుశకటాలుగా మారుతున్నాయి. మితిమీరిన లోడుతో ఈ వాహనాలు రోడ్డుపై వెళ్లుతుంటే ప్రయాణికుల రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. అంతేకాకుండా రోడ్లపై విద్యుత్ వైర్లు, స్తంభాలకు వాహనాలు తగలడంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

నిత్యకృత్యంగా రాకపోకలు

నియోజకవర్గంలోని గొల్లపాలెం–కుయ్యేరు, యానం –ద్వారపూడి, కాకినాడ–కోటిపల్లి ప్రధాన రహదారుల్లో గడ్డి వాహనాల రాకపోకలు నిత్యకృత్యంగా మారుతున్నాయి. పరిమితికి మించిన గడ్డి లోడుతో వాహనాలు రోడ్డుపై వెళ్తొంటే ఇతర వాహన చోదకులు పడరాని పాట్లు పడుతున్నారు.

గతంలో రాత్రి సమయాల్లో రాకపోకలు సాగించే ఈ గడ్డిలారీలు, ట్రాక్టర్లు ఇటీవల పగటివేళ్లలోనూ యథేచ్ఛగా తిరుగుతున్నాయి. వాహనాల రాకపోకలు రద్దీగా ఉండే సమయాల్లోనూ గడ్డివాహనాలు తిరగడం వలన ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు.

ఇక్కడి నుంచే ఇతర ప్రాంతాలకు...

రామచంద్రాపురం నియోజకవర్గంలో వ్యవసాయ ఆధారిత గ్రామాలు ఎక్కువగా ఉండటంతో ఇక్కడ నుంచే ఇతర ప్రాంతాలు, కాకినాడ తదితర పట్టణాలకు ఎండిగడ్డి రవాణా జరుగుతోంది. లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు ఇరువైపులా ఎత్తుగా ఎండిగడ్డి లోడు చేయడం వలన వాహనం సైజు భారీగా మారి రోడ్డు ఇరుకుగా మారుతోంది. గడ్డి వాహనాలు రోడ్లపై వెళుతుంటే మోటారు సైకిళ్లు, సైకిళ్లపై వెళ్లే వారికి ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు. దీంతో ముందుకు వెళ్లేందుకు వీలు లేకపోగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. అంతేకాకుండా ఈ వాహనాలు రోడ్డుపై వెళ్లే సమయంలో పైన ఉన్న విద్యుత్ వైర్లకు తగులుకుని మంటలు వ్యాపిస్తున్నాయి. కొన్నిచోట్ల వాహనాలు మలుపులు తిరగలేక విద్యుత్ స్తంభాలను ఢీకొడుతున్నాయి. గతేడాది వేసవిలో కోలంక వద్ద గడ్డి ట్రాక్టర్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టగా స్తంభం ముక్కలై నెలపై పడింది. ఆ సమయంలో గ్రామంలో విద్యుత్ సరఫరా లేకపోవటంతో రోడ్డుపై వెళుతున్న ప్రయాణికులకు త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఇటీవల గొల్లపాలెంలో రోడ్డుపై వెళుతున్న గడ్డి టాక్టరుకు పైన విద్యుత్ వైర్లు తగులుకుని మంటలు వ్యాపించగా స్థానికులు గమనించి సకాలంలో ఆర్పివేశారు. అధికారుల కళ్లముందే నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు తిరుగుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి నిబంధనలు పాటించని గడ్డి ట్రాక్టర్లపై చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించడం లేదు



లారీ, ట్రాక్టర్ వంటి వాహనాలకు మితిమీరిన లోడుతో ఎత్తుగా ఎండు గడ్డిని లోడు చేస్తున్నారు. వాహనంసైజు భారీగా మారి రోడ్డు ఆక్రమించేస్తున్నాయి. ఇవి ముందు వెళుతుంటే ఎదురుగా వచ్చు వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి.

– ద్వారంపూడి వెంకటరెడ్డి, ప్రయాణికుడు, బందనపూడి

విద్యుత్ వైర్లు తగిలి తరచూ మంటలు



మితిమీరిన లోడుతో ఎండుగడ్డి వాహనాలు రొడ్లపైకి వస్తుంటే భయాందోళనకు గురవుతున్నాం. గ్రామాల్లో విద్యుత్ లైన్లు కిందకు వెలాడుతూ ఉంటాయి. అవి గడ్డి వాహనాలకు తగులుకుని తరచూ మంటలు సంభవిస్తున్నాయి.

– పితాని సత్యనారాయణ, రైతు, తణుకువాడ

కేసులు పెడుతున్నాం



పరిమితికి మించిన లోడుతో రోడ్లపై ప్రయానించే వాహనాలకు జరిమానా విధిస్తున్నాం. కొన్ని సందర్భాల్లో కేసులు నమోదు చేసి కోర్టుకు పంపిస్తున్నాం. ప్రయాణికులకు ముందు వెళ్లే వాహనంతో ఇబ్బంది కలిగినట్టు అనిపిస్తే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

– ఎం.మోహన్‌కుమార్, ఎస్సై, గొల్లపాలెం

దోమల బెడద లేకుండా చూడాలి

మండపేట: పట్టణంలో దోమల బెడద లేకుంగా చర్యలు తీసుకుని, ప్రజారోగ్యాన్ని పరిరక్షించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధికారులకు సూచించారు. శుక్రవారం కమిషనర్ టీవీ రంగారావు ఆదేశాలతో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ముత్యాల సత్తిరాజు చర్యలు చేపట్టారు. పారిశుధ్య సిబ్బందితో 30 వార్డుల్లోను స్ప్రేయింగ్ మెషీన్ల ద్వారా దోమల మందు పిచికారీ చేశారు. కలువపువ్వు సెంటర్‌లో, పరిసర వీధుల్లో దోమల నిర్మూలన చర్యలను చైర్‌పర్సన్ పర్యవేక్షించారు. ఆమె మాట్లాడుతూ దోమలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ పాల్గొన్నారు.

సీసీ రోడ్లు, డ్రైన్లు ప్రారంభం

మండపేట: తాపేశ్వరం, ఇప్పనపాడు గ్రామాల్లో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు శుక్రవారం ప్రారంభించారు. రూ.44 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైన్‌ను, రూ.2.30 లక్షలతో నిర్మించిన గోకులం షెడ్డుకు ప్రారంభోత్సవం చేశారు. ఇప్పనపాడులో రూ.34.60 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లను కూడా ఆయన ప్రారంభించారు. అదే గ్రామంలో తుల్యభాగ గట్టుపై ఉన్న శ్మశాన వాటికకు వెళ్లే రహదారికి రూ.3.50 లక్షలతో విద్యుత్ స్తంభాలు, లైట్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఉండమట్ల శ్రీనివాస్, సర్పంచ్ కుంచె వీరమణి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

రాయవరం: రాయవరం సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ రామచంద్రపురం డివిజనల్ ఈఈ రత్నాలరావు తెలిపారు. మండలంలో కొమరిపాలెం, కొమరిపాలెం పరిసరాల్లోని పారిశ్రామిక విద్యుత్, పందలపాక, తొస్సిపూడి, రాయవరం, వి.సావరం తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని వివరించారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి



కాపవరంలో విద్యార్థినులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

రామచంద్రపురం రూరల్: బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని భీమాభాయి మహిళా మండలి హెల్త్ కోఆర్డినేటర్ జి.చంద్రకళ పిలుపు ఇచ్చారు. జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని కాపవరంలో భీమాభాయి మహిళా మండలి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. బాలికలు చదవుపై పూర్తి శ్రద్ధ వహించాలని సూచించారు. బాలికలకు 18 సంవత్సరాలు నిండకుండా వివాహాలు చేయరాదన్నారు. అలా చేస్తే వివాహం జరిపించినవారు చట్ట ప్రకారం శిక్షార్హులని తెలిపారు. కార్యక్రమంలో మండలి కార్యకర్త పి. గనికమ్మ, విద్యార్థినులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బాలికా వికాసంతోనే దేశ ఔన్నత్యం

కపిలేశ్వరపురం: బాలికా వికాసంతో దేశ ఔన్నత్యాన్ని చాటాలని జాతీయ బాలికా దినోత్సవ కార్యక్రమంలో పలువురు వక్తలు అన్నారు. మండలంలోని అంగర, మాచర జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో శుక్రవారం ఐసీడీఎస్, శ్రమ స్వచ్ఛంద సేవా సంస్థల సంయుక్తాధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు జరిగాయి. సర్పంచ్ వాసంశెట్టి సునీత, ఉప సర్పంచ్ అడపా వేణు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకటలక్ష్మి, ఐ.మాణిక్యాంబ, సేవా సంస్థ ప్రతినిధులు దుర్గారావు, సచివాలయ ఉద్యోగి భవాని, హెచ్‌ఎంలు అంగర రాజు, రమాదేవి మాట్లాడారు. బాలికల రక్షణ అందరి బాధ్యత అన్నారు. సామాజిక రుగ్మతలతో బాలికలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బాలికా రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు.

రాయవరం: మండలంలోని పసలపూడిలో జాతీయ బాలికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఐసీడీఎస్ మాచవరం సెక్టార్ పర్యవేక్షకురాలు విష్ణుకుమారి ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన సమావేశంలో బాలికల ఆరోగ్యం, విద్య, లైంగిక వేధింపులపై రక్షణ చట్టాలు, మానవ అక్రమ రవాణా, బాల్య వివాహాల వల్ల జరిగే నష్టాలు, ఆత్మరక్షణ తదితర అంశాలపై కిశోర బాలికలకు అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలికలు ర్యాలీ నిర్వహించి, మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం నూలు ఆదినారాయణ, ఉపాధ్యాయులు ఎం.వరలక్ష్మి, వైద్యారోగ్య శాఖ సీహెచ్ పి.శ్రీకాంతి, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా ఆదివారపుపేట బాలయోగి జయంతి

రామచంద్రపురం రూరల్: ఆదివారపుపేట శివ బాలయోగి మహారాజ్ జయంతిని ఆశ్రమ నిర్వాహకులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు బొండు బాల బ్రహ్మత్వంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆలయాన్ని సందర్శించి పూజలు చేశారు. కార్యక్రమంలో మంత్రాల గురువు కలకండ రామలింగేశ్వరరావు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రేపు మాంసాహార అమ్మకాలు నిషేధం

రామచంద్రపురం: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం పట్టణంలో మాంసాహార అమ్మకాలను నిషేధిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ అయ్యప్పనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం మాంసం వ్యాపారస్తులు, చికెన్ స్టాల్స్, చేపల వ్యాపారులు తమ అంగళ్లను మూసి వేయాలన్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో కూడా మాంసాహార అమ్మకాలను చేయరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యవహరిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ హెచ్చరించారు.

పాడి రైతుల అభివృద్ధికి కృషి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం: పాడి రైతుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మండలంలోని సత్యవాడలో శుక్రవారం నిర్వహించిన మెగా పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ సలాది సూర్య కళావతి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ ప్రభుత్వం పాడి పశువులు, మేకలకు ఉచితంగా టీకాలు వేస్తోందన్నారు. పశు వైద్యులు గ్రామంలో 60 మంది పాడి రైతులకు చెందిన 180 పశువులకు ఉచితంగా పరీక్షలు చేశారు. అనంతరం పాడి రైతులకు ఉచితంగా మినరల్ మిక్చర్ పంపిణీ చేశారు. ఎంపీపీ పంపన నాగమణి, పశుసంవర్ధకశాఖ అమలాపురం సంయుక్త సంచాలకులు కర్నిడి మూర్తి, రామచంద్రపురం సహాయ సంచాలకులు రామకృష్ణ, పశువైద్యులు బిందు, కృష్ణార్జున్, సురేష్‌బాబు, ఎంపీటీసీ సలాది ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పశు పోషణ సామాజిక ప్రగతికి చిహ్నం

కపిలేశ్వరపురం: సామాజిక ప్రగతికి పశుపోషణ చిహ్నమని పశు సంవర్ధక శాఖ ఆలమూరు సహాయ సంచాలకులు ఎల్.అనిత అన్నారు. శుక్రవారం తాతపూడి, అంగర గ్రామాల్లో ఉచిత పశు వైద్య శిబిరాలను నిర్వహించారు. అంగరలో శిబిరాన్ని సర్పంచ్ వాసా కోటేశ్వరరావు ప్రారంభించారు. తాతపూడిలో ఏడీఏ అనిత మాట్లాడుతూ, ఈ నెల 30 వరకూ క్షేత్ర స్థాయిలో నిర్వహిస్తున్న శిబిరాల్లో పశువులకు నట్టల నివారణ, గర్భకోశ వ్యాధులకు చికిత్సలు చేస్తారన్నారు. కోళ్లకు టీకాలు వేస్తారన్నారు. పశువులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేస్తారన్నారు. తాతపూడిలో 130, అంగరలో 136 పశువులకు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో పశు వైద్యాధికారి డాక్టర్ రమణమూర్తి, డాక్టర్ ప్రసన్న వైద్య సేవలందించారు.

93 పశువులకు వైద్య పరీక్షలు

రాయవరం: మండల కేంద్రమైన రాయవరంలో పశు సంవర్ధక శాఖ నిర్వహించిన పశువైద్య శిబిరాన్ని ఎంపీపీ చౌడు వెంకటరమణ శుక్రవారం ప్రారంభించారు. రాయవరం ప్రాంతీయ పశు వైద్యశాల ఏడీ అనిత ఆధ్వర్యంలో 93 పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 30 మినరల్ మిక్సర్, 20 కాల్షియం సీసాలను పశు పోషకులకు ఎంపీపీతో పాటు, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ ఉండవిల్లి రాంబాబు అందజేశారు.

రోడ్డు భద్రత నియమాలు పాటించాలి

డీటీవో శ్రీనివాసరావు



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీటీవో శ్రీనివాసరావు

మండపేట: వాహనాలు నడిపే వారంతా రహదారి భద్రత నియమాలను పాటించాలని డీటీవో డి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా శుక్రవారం పట్టణంలో మండపేట ఎంవీఐ ఎస్ లక్ష్మీశ్రీదేవి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. డీటీవోతో పాటు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. పెద్ద కాలువ వంతెన వద్ద మొదలైన ఈ ర్యాలీని ఆటో, లారీ డ్రైవర్లు మెయిన్ రోడ్డు మీదుగా కొనసాగించారు. డీటీవో మాట్లాడుతూ, వాహనాల డ్రైవర్లు ప్రయాణ సమయాల్లో మద్యానికి దూరంగా ఉండాలన్నారు. పాఠశాలల బస్సులు, ఆటోల్లో విద్యార్థులు, ప్రయాణికులను పరిమితికి మించి ఎక్కించరాదన్నారు. ర్యాష్ డ్రైవింగ్, మితిమీరిన వేగంతో ప్రాణాలకు ముప్పు కలుగుతుందన్న విషయాన్ని ప్రతి డ్రైవరు గ్రహించాలన్నారు. టూ వీలర్లు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కోరారు. వాహన రికార్డులు సక్రమంగా ఉండేలా చూసుకోవాలని సూచించారు. టౌన్ ఏఎస్సై చిన్నారావు, హోంగార్డులు, డ్రైవర్లు పాల్గొన్నారు.



మండపేటలోని గొల్లపుంత రోడ్డులో కమ్మేసిన మంచు



గొల్లపాలెంలో పచ్చని పొలాలను కప్పేసిన మంచు

మంచు మసకేసిందిలే..

కె.గంగవరం: గ్రామాల్లో ప్రతిరోజూ ఉదయం మంచు కురుస్తోంది. వాతావరణంలో మార్పుల కారణంగా తెల్లవారుజాము నుంచి ఉదయం 9 గంటల వరకూ పల్లెలను మంచు దుప్పటిలా అల్లుకుంటోంది. గత రెండు రోజులుగా భారీగా మంచు కురుస్తోంది. శుక్రవారం ఉదయం పచ్చని పంట పొలాలు, కొబ్బరి చెట్లపై మంచు కనువిందు చేసింది. ఉదయాన్నే పొలం పనులకు వెళ్లే రైతులు, కూలీలు మంచు కారణంగా ఇబ్బందులు పడ్డారు. కొన్ని రోజులుగా ఉదయం మంచు కురుస్తుండగా 10 గంటలు దాటాక ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. సాయంత్రం ఐదు గంటల నుంచే చలిగాలులు వీస్తున్నాయి. మంచు కారణంగా వ్యాపారులు, విద్యార్థులు, ప్రయాణాలు చేసే వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండపేట: పట్టణం మంచు దుప్పట్లో కునుకు తీసింది. శుక్రవారం ఉదయం దట్టమైన పొగమంచు కమ్మేసింది. గురువారం అర్ధరాత్రి నుంచి విపరీతమైన పొగమంచు, దానికితోడు చలి పంజా విసిరింది. ఉదయం 8 దాటినా మంచు దుప్పటి వీడలేదు. పంట క్షేత్రాలు, పొలం గట్లన్నీ మంచుతో మూసుకుపోవడమే కాకుండా, పుర వీధులను కూడా మంచు కప్పేసింది. మెయిన్ రోడ్డులో దారి కనిపించక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బైపాస్ రోడ్డులో లారీలు, వ్యాన్లను మంచు తీవ్రతకు నిలిపివేశారు. సూర్యుడు సైతం మంచు తెరల మధ్య చిక్కుకున్నాడు.

కాజులూరు: పచ్చని పొలాలు, పచ్చికబయళ్లను మంచు కమ్మేస్తోంది. ముందు రోజు సాయంత్రం కంటికి కనిపించిన పచ్చని పైరు, మొక్కలు, చెట్లు తెల్లవారేసరికి మంచు తెరల్లో మూసుకుపోతున్నాయి. గతవారం రోజులుగా మండల పరిధిలోని గ్రామాల్లో మంచు భారీగా కురుస్తోంది. తెల్లవారుజాము నుంచి ఉదయం 10 గంటల వరకూ రోడ్లను మంచు కమ్మేయడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.

రూ.73.65 కోట్లతో మండపేట మున్సిపల్ బడ్జెట్

- ఆదాయం రూ.69.81 కోట్లు
- ప్రభుత్వ గ్రాంటు రూ.59.10 కోట్లు
- ప్రవేశపెట్టిన చైర్‌పర్సన్ దుర్గారాణి



బడ్జెట్‌ను ప్రవేశ పెడుతున్న చైర్‌పర్సన్ దుర్గారాణి

మండపేట: పురపాలక సంఘ 2025–26 వార్షిక బడ్జెట్‌ను శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ ఆమోదించింది. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో బడ్జెట్, సాధారణ సమావేశాలు నిర్వహించారు. పురపాలక సంఘ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రవేశపెట్టిన బడ్జెట్లో రూ.73 కోట్ల 65 లక్షల 9 వేల 465తో 2025–26 ఆర్థిక సంవత్సరానికి పురపాలక సంఘం బడ్జెట్‌ను ఏకగ్రీవంగా ఆమోదించింది. బడ్జెట్ వివరాలిలా ఉన్నాయి.

కేటాయింపులు ఇలా..

ఆదాయం రూ.69 కోట్ల 80 లక్షల 85 వేల 900 కాగా, ఖర్చు రూ.71 కోట్ల 79 లక్షల వెయ్యిగా చూపించారు. వీటిలో అభివృద్ధి పనులకు రూ.59.10 కోట్ల ప్రభుత్వ గ్రాంటుగా చూపించారు. రహదారుల నిర్మాణానికి రూ.27.70 కోట్లు, పార్కుల అభివృద్ధికి రూ.2.44 కోట్లు, నూతన డ్రైన్ల నిర్మాణానికి రూ.3.56 కోట్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణానికి రూ.6.73 కోట్లను కేటాయించారు. అదేవిధంగా శ్మశాన వాటికల అభివృద్ధికి రూ.5 లక్షలు, వీధి దీపాల ఏర్పాటుకు రూ.25 లక్షలు, టాయిలెట్స్‌లో మౌలిక సదుపాయాలకు రూ.25 లక్షలు, ప్రజారోగ్య నిర్వహణ కోసం రూ.5.13 లక్షలు, మంచినీటి సరఫరా అభివృద్ధికి రూ.1.45 కోట్లు, మున్సిపల్ షాపుల నిర్మాణానికి రూ.70 లక్షలు, భూ సేకరణకు రూ.9 కోట్లు, ప్రజారోగ్య భవనాల నిర్మాణానికి రూ.1.85 కోట్లు, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్‌కు రూ.1.35 కోట్లు, చెరువుల సుందరీకరణ, నీటి వనరుల అభివృద్ధికి (అమృత్ పథకానికి)రూ.కోటి నిధులను కేటాయించారు.

ఎస్సీ, ఎస్టీ ప్రాంతాలకు..

రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం ఎస్సీ నివాస ప్రాంతాల అభివృద్ధికి బడ్జెట్లో 15 శాతం చొప్పున నిధులు కేటాయించారు. ఈ ప్రకారం రూ.95.47 లక్షలు కేటాయించగా, ఎస్టీ ప్రాంతాల అభివృద్ధికి 7.5 శాతం చొప్పున రూ.47.73 లక్షలు, మహిళా–శిశు సంక్షేమ కార్యక్రమాలకు 5 శాతం చొప్పున రూ.31.82 లక్షలు, దివ్యాంగుల సంక్షేమ పథకాలకు 3 శాతం చొప్పున రూ.19.09 లక్షలను బడ్జెట్లో నిధులు కేటాయించారు. మురికివాడల్లో కనీస సదుపాయాల కల్పనకు 40 శాతం నిధులు అనగా రూ.2.14 కోట్ల కేటాయింపు జరిగింది. ఈ బడ్జెట్లో పన్నులు, వివిధ ఆదాయాల రూపేణా తలసరి ఆదాయం రూ.3,100 కాగా, అభివృద్ధి పనులకు తలసరి రూ.10,542 ఖర్చుగా చూపించారు.

టిడ్కో గృహాల రుణ మాఫీ సంగతేంటి?

కౌన్సిల్‌లో వేగుళ్లను ప్రశ్నించిన ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు



టిడ్కో రుణాలపై ఎమ్మెల్యేను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పట్టణ ప్రజలకు టిడ్కో గృహాల రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు హామీ ఇచ్చారని, ఆ విషయం ఎంత వరకు వచ్చిందని శుక్రవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. లబ్ధిదారులు రుణ మాఫీ కోసం ఎదురుచూస్తున్నారని చెప్పారు. దీనిపై ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సమాధానమిస్తూ, తాను ఈ విషయాన్ని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లానని, ఆ విషయం పరిశీలనలో ఉందన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలన్నింటినీ నెరవేరుస్తుందని, రాష్ట్ర ఖజానాలో నిధులు తక్కువగా ఉన్నందున ప్రాధాన్య క్రమంలో వాగ్దానాలను నెరవేరుస్తామన్నారు. చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన జరిగిన సాధారణ, బడ్జెట్ సమావేశాల్లో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ఎక్స్ అఫీషియో సభ్యులుగా హాజరయ్యారు. కౌన్సిల్ ఆమోదం కోసం తీసుకొచ్చిన అజెండాలోని 33 అంశాల్లోని కొన్నింటిపై సుదీర్ఘ చర్చ జరిగింది. ఇందులో 31, 32 అంశాలను రికార్డు చేయగా, 15వ అంశాన్ని నిలిపివేశారు. మిగిలిన అంశాలన్నింటిపై కౌన్సిల్ ఆమోద ముద్ర వేసింది.

రోడ్డు మరమ్మతులు అధ్వానం

పట్టణంలోని 30 వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్ల మరమ్మతు పనులు చాలా దారుణంగా ఉన్నాయని 9వ వార్డు టీడీపీ కౌన్సిలర్ చుండ్రు సుబ్బారావు చౌదరి తెలిపారు. దానిపై 30వ వార్డు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ మారిశెట్టి సత్యనారాయణ సంఘీభావం తెలిపారు. సత్యశ్రీ రోడ్డు మీదుగా సంగం కాలనీ రోడ్డుకిరువైపులా ఉన్న బెర్ములు భారీ గోతులుగా ఏర్పడ్డాయన్నారు. బెర్ములు పూడ్చకపోవడంతో గతంలో ఇదే రోడ్డులో ఓ విద్యార్థి చనిపోయాడని, ఇంకా ఎందరు ప్రాణాలు కోల్పోవాలని మున్సిపల్ అధికారులపై మండిపడ్డారు. సుబ్బారావు మాట్లాడుతూ, సీసీ రోడ్ల మరమ్మతులు దాదాపు అన్నిచోట్లా ఘోరంగా ఉన్నాయని మండిపడ్డారు. అక్కడక్కడా సిమెంటు పూత పెట్టి కాంట్రాక్టర్ మమ అనిపించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ రంగారావు మాట్లాడుతూ, నాణ్యత లోపించిన పనులను గుర్తించి, ఆ కాంట్రాక్టరుపై చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే పట్టణంలో ఏటా పన్నులు పెంచుతూపోతే సామాన్యుడు ఆ భారం ఎలా మోయగలడని సుబ్బారావు ప్రశ్నించారు.

ఆ కాంట్రాక్టర్ అవసరం ఉందా..!: తోట

అజెండాలోని 15వ అంశం వచ్చేసరికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మాట్లాడుతూ, మండపేట పురపాలక సంఘంలో అభివృద్ధి పనులను ఆటంక పరిచే వివాదాస్పద కాంట్రాక్టర్ కట్టుమేను ప్రవీణ్‌కృష్ణ టెండర్లను, పనులను పురపాలక సంఘం ఆమోదించడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. చీటికిమాటికి కోర్టుకు వెళుతూ, పనుల నాణ్యత, టెండర్ల కేటాయింపుపై వివాదాలు చేసిన కాంట్రాక్టర్‌కు పనులు కేటాయించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని కౌన్సిల్ సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. దీంతో చైర్‌పర్సన్ దుర్గారాణి ఆ అంశాన్ని నిలిపివేశారు. ఇలాఉంటే అజెండాలో చేర్చిన శెట్టిబలిజ రామాలయం, మసీదులోని స్టోర్‌రూములకు సంబంధించి పన్ను మినహాయింపుపై ఆమోదం తెలపగా, అన్నపూర్ణమ్మ దేవాలయానికి సంబంధించిన అంశం అజెండాలో ఎందుకు చేర్చలేదని ఆరో వార్డు కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాథం ప్రశ్నించారు. దానిపై కో–ఆప్షన్ సభ్యుడు రాజబాబు కూడా ప్రస్తావించారు. అక్కడ అనధికార నిర్మాణం జరిగిందన్న ఫిర్యాదుపై విచారణ అనంతరం రూ.5 లక్షలకు పైగా ఫైన్ విధించి, కోర్టుకు దాఖలు చేసినట్టు కమిషనర్ రంగారావు తెలిపారు. ఏ నిర్ణయం తీసుకోవాలన్న కోర్టు వ్యవహారం కొలిక్కి రావాలన్నారు. అనంతరం ప్రవేశపెట్టిన బడ్జెట్‌ను సభ్యులంతా ఏకగ్రీవం తెలపగా చైర్‌పర్సన్ దుర్గారాణి ఆమోదించారు. సమావేశంలో డీఈ శ్రీనివాసరావు, ఏఈ పవన్‌కుమార్, ఆర్వో జీవీఎస్ శాస్త్రి, టౌన్‌ప్లానింగ్, శానిటరీ, టిడ్కో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.